# భారీగా నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం

- ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసిన వికారాబాద్ పోలీసులు
- 35 లక్షల విలువైన 20 క్వింటాళ్ల (53 బస్తాలు) నకిలీ విత్తనాలు సీజ్
- రైతులను మోసం చేస్తే కఠినమైన చర్యలు
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా హెచ్చరిక



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** జిల్లాలో ఎలాంటి నకిలీ విత్తనాలను కొనుగోలు, అమ్మకాలు జరుగకుండా ముందస్తు చర్యలలో బాగంగా జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ పరిగి డి.ఎస్.పి పర్యవేక్షణలో 22 సోమవారం న ఉదయం సుమారు 12:00 గంటల సమయంలో, తుంకలగడ్డ పరిధిలో కొంతమంది నకిలీ విత్తనాలు తరలిస్తున్నారు అని సమాచారం అందిన వెంటనే పరిగి వ్యవసాయ శాఖ సహాయంతో పరిగి పోలీస్, టాస్క్ ఫోర్స్ యొక్క సంయుక్త తనకీలలో భాగంగా లక్నపూర్ ఏరియా నుండి వస్తున్న ఒకే మోటార్ సైకిల్ ని అపి తనికి చేయగా వారివద్ద ఉన్న సంచిలో నకిలీ పత్తి విత్తనాలు ఉన్నాయి, వారి పేర్లు తెలుసుకోగా మునగారి హన్మయ్య తండ్రి పెంటప్ప సులేగం నరేందర్ తండ్రి రాజు ఉన్నారు వారిని విచారించగా, హనమయ్య రైతులవద్ద నుండి పత్తిని కొనుగోలు చేసి దానిని కర్ణాటకలో రాష్ట్రం జిన్నింగ్ చేయించి నకిలీ పత్తి విత్తనాలు తయారు చేశాడు, వారికి కిలో 500 రూ:లు ఖర్చు అవుతుంది, కానీ వీరు అమాయక రైతులకు కిలో 1500 నుండి 2000 రూ:ల మద్య అమ్మడం జరుగుతుంది, విత్తనాలను రైతులకు అమ్మడం కొరకు అతను హకీంపేట్ గ్రామానికి చెందిన దొరేమొని మల్లేష్, మద్దూర్ గ్రామానికి చెందిన సులేగం నరేందర్ రాజు, చింతలదేవి గ్రామానికి చెందిన ఒరుగంటి మల్యాద్రి రైతులకు ఈ విత్తనాలు నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే మీకు అధిక మొత్తం ఇస్తాను అని ఆశ చూపగా వారు తకువ సమయములో ఎక్కువ డబ్బులు సంపాదించాలని వారు అందరూ కలిసి వారు తయారుచేసిన పత్తి విత్తనాలు చాలా మంచివి గడ్డి మందు కొట్టినా చావవు అని రైతులను నమ్మించి సోమవారం అట్టి నకిలీ విత్తనాలను తుంకులగడ్డ దగ్గర నిర్మాణములో ఉన్న ప్రభుత్వ డబుల్ బెడ్ రూమ్ లో దాచి, వాటిలో నుండి కొంత కొంత అమ్మడానికి తీస్కొని వెళ్తుండగా పోలీస్ వారు పట్టుకొన్నారు. హనమయ్య సమాచారంతో మరొక వ్యక్తి పై వారిలాగే మరొక వ్యక్తి నాదెండ్ల నరసింహం, నర్సింగరావు కూడా పత్తిని కొనుగోలు చేసి నకిలీ విత్తనాలు తయారు చేసి అమ్మడానికి ప్రయత్నిస్తున్నాడు అని సమాచారం రాగా అతనిని కూడా అక్కడే పట్టుకొని అతని వద్దనుండి కూడా 3 క్వింటాళ్ళ నకిలీ పత్తివిత్తనాలు పట్టుకొనయినది. నేరస్థుల పట్టుబడిలో మంచి ప్రతిబ కనబరిచిన, డి.ఎస్.పి వికారాబాద్ అంజయ్య, పరిగి సి.ఐ కొండల్ రెడ్డి, జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్.కె. అన్వర్ పాషా, పరిగి యస్. ఐ శ్రీ మోహన్ కృష్ణ, జిల్లా టాస్క్ ఫోర్స్ టీం సబ్యులు రమేష్ హెచ్ సి సురేష్, పీసీ, రమేష్, పీసీ, చిన్నయ్య, పీసీ పరిగి సిబ్బంది ఉన్నారు.నకిలీ విత్తనాల విక్రేతలకు జిల్లా ఎస్పీ తీవ్ర హెచ్చరిక చేశారు. రైతులే లక్ష్యంగా నకిలీ, నిషేధిత విత్తనాలను విక్రయిస్తూ వారి జీవితాలతో ఆడుకునే లాభాపేక్షాపరులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తీవ్రంగా హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నకిలీ కాటన్ (పత్తి) విత్తనాలు అమ్మినా, నిల్వ చేసినా, రవాణా చేసినా వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. రైతు సోదరులు కూడా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, రశీదులను తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. ఎక్కడైనా నకిలీ విత్తనాల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ తెలిపారు.

**నిందితుల వివరాలు:**

1) మునగారి హన్మయ్య తండ్రి పెంటప్ప (40), సజ్జాఖాన్‌పేట్ గ్రామానికి కోస్గి మండలం నారాయణపేట జిల్లా,
2) నాదెండ్ల నరసింహం తండ్రి నర్సింగరావు (61) ప్రస్తుతం బాలాజీనగర్, మహబూబ్‌నగర్ లో నివసిస్తూ స్వంత స్వస్థలం కొండాపురంగా, నెల్లూరు జిల్లా ఆంధ్రప్రదేశ్,
3) సులేగం నరేందర్ తండ్రి రాజు (43) మద్దూర్ గ్రామానికి చిందిన నారాయణపేట జిల్లా,
4) దొరేమొని మల్లేష్ (41) హకీంపేట్ గ్రామానికి చెందిన దూద్యాల మండలం వికారాబాద్ జిల్లా
5) ఒరుగంటి మల్యాద్రి (47) దౌలతాబాద్, వికారాబాద్ జిల్లా స్వంత స్వస్థలం చింతలదేవి గ్రా: కొండాపురం మండలం నెల్లూరు జిల్లా ఏపీ.

స్వాదీనపర్చుకొన్న నకిలీ విత్తనాల విలువ:

వీరి వద్ద నుండి సుమారు 20 క్వింటాళ్ల (53 బస్తాలు) నకిలీ పత్తి విత్తనాలను, ఒక మోటార్ సైకిల్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇట్టి నకిలీ పత్తనాల విలువ సుమారు 35 లక్షల విలువ ఉందన్నారు.

## నషా ముక్త్ భారత్ అభియాన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా




- జూన్ 22 నుండి 26 వరకు జిల్లావ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన వారోత్సవాలు
- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహమెహ్రా

**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** జూన్ 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నషా ముక్త్ భారత్ అభియాన్ గోడ పత్రికను (పోస్టర్‌ను) జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా జూన్ 22 నుండి 26 వరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే సామాజిక శాపమని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉంటూ పోలీసు శాఖకు సహకరించాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా విక్రయాలపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని, సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, ఏ ఆర్ డీఎస్పీ వీరేష్, ఏఓ ఖాజామోహినొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



## గాలివాన బీభత్సం: ఎర్రగడ్డలో గుండమ్మల నరేష్ ఇంటిపైకప్ప లేచిపోయి కుటుంబం రోడ్డున!

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** మండల పరిధిలోని ఎర్రగడ్డ గ్రామంలో సోమవారం అకస్మాత్తుగా కురిసిన భారీ గాలివాన తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఈ ఈదురు గాలుల ధాటికి గ్రామానికి చెందిన గుండమ్మల నరేష్ అనే నిరుపేద ఇల్లు పూర్తిగా దెబ్బతింది. గాలి తీవ్రతకు ఇంటిపై ఉన్న కప్పు ఒక్కసారిగా లేచిపోయి దూరంగా పడిపోయింది.

**కన్నీరుమున్నీరవుతున్న బాధితుడి కుటుంబం**

బాధితుడు గుండమ్మల నరేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవించే ఈ కుటుంబానికి ఉన్న ఒక్కగానొక్క ఆసరా ఈ ఇల్లే. ఇంటిపైకప్పు లేచిపోవడంతో ఇంట్లోని సామాగ్రి, నిత్యావసర వస్తువులు, పిల్లల పుస్తకాలు, బట్టలు అన్నీ వర్షానికి తడిసి ముద్దయ్యాయి. ఉన్నపళంగా నిలువనీడ కోల్పోవడంతో నరేష్ తన భార్య, ఇద్దరు చిన్న పిల్లలతో కలిసి ఆకాశం వైపు చూస్తూ కన్నీరుమున్నీరవుతున్నాడు.

**ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఆదుకోవాలి**

రెక్కాడితే గాని డొక్కాడని తమకు ఇంత పెద్ద కష్టం రావడంపై నరేష్ కుటుంబం దీనస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. సర్వస్వం కోల్పోయి వీధిన పడిన తమను ప్రభుత్వ పెద్దలు, మండల అధికారులు తక్షణమే స్పందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు. నరేష్ కుటుంబానికి అత్యవసర సహాయం అందించి, నివాస యోగ్యంగా ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని గ్రామస్తులు కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# చెన్నారంలో శ్రీవిద్య వివో భవన నిర్మాణానికి శ్రీకారం

### సర్పంచ్ నాగమణి ముగ్గు పోసి పనులు ప్రారంభించారు.. గ్రామాభివృద్ధికి మరో అడుగు



**ఖమ్మం రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి:మండలంలోని చెన్నారం గ్రామంలో మహిళా సంఘాల అభివృద్ధికి బాటలు వేస్తూ శ్రీవిద్య గ్రామ సమైక్య సంఘం (వివో) నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గురువారం చెన్నారం సర్పంచ్ బట్టపోతుల నాగమణి,చెన్నారం గ్రామంలో పాండవ చెలక లో సంప్రదా యబద్ధంగా ముగ్గు పోసి వివో భవన నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.గ్రామైక్య సంఘం భవనం నిర్మాణంతో మహిళా సంఘాలకు సొంతసమావేశ మందిరం అందుబాటులోకి రానుంది. పొదుపు సంఘాల లావాదేవీలు, శిక్షణా కార్యక్రమాలు, ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్ కు ఈ భవనం ఉపయోగపడుతుంది. గ్రామంలోని 60కి పైగా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.ఈ సందర్భంగా సర్పంచ్ నాగమణి మాట్లాడుతూ "మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందితేనే గ్రామం అభివృద్ధి చెందుతుంది. వివో భవనం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. మహిళా సంఘాలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయితిరాజు ఏఈ పస్తం ప్రసాద్, చెన్నారం గ్రామ కార్యదర్శి రవి, వార్డు మెంబర్లు సుల్తాన్ వీరబాబు,నెలపాటి రమ్య, కాంగ్రెస్ నాయకులు సుబ్బయ్య ఎల్లుట్ల సైదులు రిపోర్టర్ తదితరులు పాల్గొన్నారు...

## మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- యాంటీ డ్రగ్స్ సదస్సులో పాల్గొన్న




- ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** యువతను పట్టిపీడిస్తున్న వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరమని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి పిలుపునిచ్చారు. తిరుమలాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'యాంటీ డ్రగ్స్' (మత్తు పదార్థాల వ్యతిరేక) అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి సమాజంలో మత్తు పదార్థాల వాడకం యువత భవిష్యత్తును చీకట్లోకి నెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, కేవలం చదువుపైనే శ్రద్ధ పెట్టాలని హితవు పలికారు. డ్రగ్స్ వంటి వ్యసనాల వల్ల ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, కుటుంబాలు రోడ్డున పడతాయని హెచ్చరించారు. మత్తు పదార్థాల నిర్మూలన కేవలం పోలీసుల వల్లే సాధ్యం కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇందుకు సహకరించాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమం లో కూసుమంచి సీఐ సంజీవ్, స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక పోలీస్ సిబ్బంది వివిధ రాజకీయ నాయకులు ప్రముఖులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్గీకరణ రోస్టర్ పాయింట్లు సవరణపై డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన మాల మహానాడు నేతలు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లపై మాలలకు జరుగుతున్న అన్యాయంపై తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మాల మహానాడు నేతలు ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు గ్రూప్ త్రీ లో ఉన్న మాల వర్గానికి కేటాయించిన ప్రస్తుత రోస్టర్ పాయింట్లను సవరించాలని గ్రూప్ 3 ప్రారంభ పోస్టర్ పాయింట్లు లోనే మాలలకు సముచిత ప్రాధాన్యం కల్పించే విధంగా రోస్టర్ లో సవరణ చేయాలని గ్రూప్ త్రీ వర్గానికి 16వ రోస్టర్ పాయింట్ లోపల అవకాశం కల్పించాలని వారు కోరారు ప్రస్తుతం ఉన్న విధానం వల్ల మాలలు విద్యా ఉద్యోగ అవకాశాలు పూర్తిగా కోల్పోతున్నారని బట్టికి నాయకులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాలమహానాడు నేతలు గుంతేటి వీరభద్రం లింగాల రవికుమార్ దాసరి దానియేలు దామల సత్యం దాసరి శ్రీనివాస్ కొరివి భాస్కర్ కరాటే వేణు జమ్మి వీరబాబు కొట్టే నాగేంద్ర కుమార్ చింతమల్ల గురుమూర్తి కొప్పుల రామారావు నూకమల్ల రాజు మెట్టు రాజు తదితరులు పాల్గొన్నారు

## వర్షా కాలంలో వచ్చే అంటూ వ్యాధుల నివారణకు జిల్లా అధికారులు సహకరించాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె సుధాకర్ లాల్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశంలో ప్రస్తుతం జరుగుతున్న డయేరియా నియంత్రణ కార్యక్రమం ఈనెల 28వ తేదీ నుండి జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమం గురించి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి జిల్లా అధికారులతో సమన్వయ, సమీక్ష సమావేశం నిర్వహించరు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులందరూ వారి శాఖల తరపున వర్షాకాలంలో ప్రధానంగా ప్రబలే అంటువ్యాధుల నివారణకు సహకరించాలని ప్రస్తుతం జరుగుతున్న డయేరియా నివారణ కార్యక్రమం, పల్స్ పోలియో కార్యక్రమం అమలు లో అన్ని శాఖల వారు విధిగా పాల్గొనాలని ఆదేశించారు. అనంతరం డయేరియా నివారణకు సంబంధించిన ఐ ఇ సి మెటీరియల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకటాచారి, డి ఆర్ డి ఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ బసవరాజ్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు

## ఓటమి పాలైనా మాట నిలబెట్టుకున్న మహేష్



**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందినప్పటికీ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మొలంగూర్ గ్రామానికి చెందిన గాజుల మహేష్ మరోసారి ఉదారత చాటుకున్నారు. ఎన్నికల సమయంలో గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి రూ.10 వేలు, ఆడపిల్ల జన్మిస్తే రూ.5 వేలు అందిస్తానని ప్రకటించారు. ఇటీవల మరణించిన దాసారపు కొమురమ్మ కుటుంబానికి సోమవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో మహేష్ అందించిన ఇది నాల్గవ ఆర్థిక సహాయం కావడం విశేషం. స్వల్ప ఓట్ల తేడాతో ఎన్నికల్లో ఓడిపోయినా ఇచ్చిన మాట ప్రకారం సహాయం అందించడంపై గ్రామస్తులు మహేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్‌కు అవకాశం



**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** శంకరపట్నం మండలంలో రైతుల అవసరాల కోసం 15,200 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రైతులు తమ మొబైల్ నంబర్, ఓటీపీ ద్వారా యాప్‌లో లాగిన్ అయి పంట వివరాలు నమోదు చేసి సహకార సంఘాలు లేదా ప్రైవేట్ దుకాణాల్లో యూరియాను బుక్ చేసుకోవచ్చని సూచించారు. యూరియా బుకింగ్ ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత ఏఈఓను రైతు వేదిక వద్ద లేదా మండల వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని అధికారులు తెలిపారు.

## ఒక్క వానకే నీటమునిగిన కొత్తగట్టు పంచాయతీ కార్యాలయం




**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** ఒక్క వర్షానికే కొత్తగట్టు గ్రామపంచాయతీ కార్యాలయం నీటమునగడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. జాతీయ రహదారి నిర్మాణం తర్వాత రహదారి స్థాయి పంచాయతీ భవనం కంటే ఎత్తుగా ఉండటంతో వర్షపు నీరు మట్టితో కలిసి కార్యాలయ ప్రాంగణంలోకి చేరింది. వర్షపు నీరు నిల్వ ఉండటంతో కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి నెలకొంటున్నప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి నిర్మాణంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గాలు లేకపోవడంతో పంచాయతీ కార్యాలయంతో పాటు గ్రామంలోని కొన్ని ఇళ్లలోకి కూడా నీరు చేరుతోందని స్థానికులు తెలిపారు. వెంటనే నీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరుతున్నారు.

## కొత్తగట్టు ర్యాంప్‌కు గ్రీన్ సిగ్నల్



**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపై కొత్తగట్టు వద్ద ఇరువైపులా ర్యాంప్ ఏర్పాటు చేయాలన్న స్థానికుల చిరకాల డిమాండ్‌కు పరిష్కారం లభించింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశాలతో హైవే అధికారులు ర్యాంప్ నిర్మాణ పనులకు సిద్ధమయ్యారు. గతంలో కొత్తగట్టు గ్రామ ప్రజలు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బండి సంజయ్‌ను కలిసి ర్యాంప్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ర్యాంప్ లేకపోవడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. దీనిపై స్పందించిన బండి సంజయ్, హైవే ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్‌కు సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారికి ఇరువైపులా ర్యాంప్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టి నిర్మాణానికి అవసరమైన చర్యలు ప్రారంభించారు. దీంతో కొత్తగట్టు, పరిసర గ్రామాల ప్రజల రవాణా ఇబ్బందులు తొలగనున్నాయి.

## గొల్లపల్లిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే మదన్మోహన్



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామం ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రత్యేక చొరవతో వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ క్రమంలో గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్థులు బోనాలతో ఘన స్వాగతం పలికారు. గొల్లపల్లి గ్రామంలో 20 లక్షల నిధులతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మదన్ మోహన్ భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా గ్రామ మహిళల అభ్యర్థన మేరకు రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న మహిళా సంఘ భవనానికి కూడా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ, గత రెండున్నర సంవత్సరాలుగా ఎల్లారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, నియోజకవర్గ అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడబోమని స్పష్టం చేశారు. మహిళలు కోరిన మేరకు మహిళా సంఘ భవనాన్ని మంజూరు చేయడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ అధికారంలోకి వచ్చిన తర్వాత గొల్లపల్లి గ్రామానికి సీసీ రోడ్లు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మహిళా సంఘ భవనం, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు, గృహ జ్యోతి వంటి పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుబాటులోకి వచ్చాయని గ్రామస్థులు తెలిపారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే గారికి ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ పాటిల్, రామారెడ్డి మండల అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, గ్రామ సర్పంచ్ అటికల కిషన్ యాదవ్, పాలకవర్గం, మండల సీనియర్ నాయకులు, వివిధ హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులు, మండల మహిళా అధ్యక్షులు, మహిళా నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## రామారెడ్డిలో నూతన మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు



**డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ పటేల్**

**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, ప్రజలకు పార్టీని మరింత చేరువ చేయడం లక్ష్యంగా ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ పటేల్ రామారెడ్డి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ పటేల్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌మోహన్ మాట్లాడుతూ, ప్రజల విశ్వాసమే కాంగ్రెస్ పార్టీకి అతిపెద్ద బలమని, ప్రజల సంక్షేమం నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే సేవా వేదికగా ఈ నూతన కార్యాలయం నిలవాలని ఆకాంక్షించారు. డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ పటేల్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని, ఈ కార్యాలయం కార్యకర్తలకు మార్గదర్శక కేంద్రంగా, ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగాఉపయోగపడుతుందని అన్నారు.అనంతరం ఎమ్మెల్యే మదన్‌మోహన్, డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ పటేల్ రామారెడ్డి మండలంలోని ప్రసిద్ధ కాలభైరవ స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ఎల్లారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రామారెడ్డి ఇస్సన్నపల్లి గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్ మరియు యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నాగారంలో బారీగా అక్రమ నిర్మాణాలు

- టౌన్ ప్లానింగ్ కనుల్లో అక్రమ నిర్మాణాలు
- అధికారులకు సవాల్ విసురుతున్న నిర్మాణదారుడు..
- టౌన్ ప్లానింగ్ అధికారుల సహకారంతోనే అక్రమ నిర్మాణాలు...?



**నాగారం, రాజముద్ర న్యూస్:** నాగారం డివిజన్ లో పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ సత్యనారాయణ కాలనీలో ఫ్రైడే మార్కెట్ మెయిన్ రోడ్డుపై అక్రమ షెడ్ నిర్మాణం యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రికి రాత్రే నిర్మాణ పనులు చేపట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికుల కథనం ప్రకారం షెడ్ నిర్మాణదారుడు అధికారుల అండదండలతోనే అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నాడనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకు లేకపోవడం ఆంతర్యం ఏంటి..? అనుమతులకు విరుద్ధంగా షెడ్ నిర్మాణం పై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా ప్రధాన రహదారిపై అక్రమ షెడ్ నిర్మాణం జరుగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ యంత్రాంగం స్పందించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. అంతా నా ఇష్టం అనే రీతిలో అక్రమ నిర్మాణదారుడు అధికారులకే సవాల్ విసురుతూ టౌన్ ప్లానింగ్ నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమ షెడ్డు నిర్మాణం కొనసాగిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవిష్యత్ కాలంలో నగరాభివృద్ధి నిబంధనలను ఉల్లంఘిస్తూ షెడ్ యజమాని చేపడుతున్న అక్రమ షెడ్డు నిర్మాణాల వల్ల నిర్మాణాల వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోల్పోవడంతో పాటు భవిష్యత్తులో ట్రాఫిక్, ప్రజా భద్రత సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని అక్రమ నిర్మాణంపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## నీట్ విద్యార్థినికి భీమారం ఎస్సై ఆపద్బాంధవుడు




- ఫొటో మర్చిపోయి ఆందోళనలో ఉన్న యువతికి తక్షణ సహాయం
- పోలీసు వాహనంలో తీసుకెళ్లి ఫొటోలు ఇప్పించిన వైనం

**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** భీమారం ఎస్సై రాజేందర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి ఒక విద్యార్థిని భవిష్యత్తును కాపాడారు. నీట్ పరీక్షా కేంద్రం వద్ద నిబంధనల ప్రకారం ఫొటో లేకపోవడంతో ఆందోళనకు గురైన విద్యార్థినికి ఆయన సకాలంలో సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్, మంచిర్యాల జోన్ పరిధిలోని మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నీట్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్ష రాయడానికి వచ్చిన ఒక విద్యార్థిని తన పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావడం మర్చిపోయింది. కేంద్రం నిబంధనల ప్రకారం ఫొటో తప్పనిసరి కావడంతో లోపలికి అనుమతించలేదు. దీంతో పరీక్ష రాయలేనేమోననే భయంతో ఆమె తీవ్ర ఆందోళనతో బయటకు వచ్చింది. అక్కడ విధుల్లో ఉన్న భీమారం ఎస్సై రాజేందర్ విద్యార్థిని ఇబ్బందిని గమనించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్ష సమయం దగ్గర పడుతుండటంతో ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన పోలీసు వాహనంలోనే ఆమెను సమీపంలోని ఫొటో స్టూడియోకు తీసుకెళ్లారు. అక్కడ తక్షణమే ఫొటో తీయించి, నిమిషాల వ్యవధిలో తిరిగి పరీక్షా కేంద్రానికి చేర్చారు. ఎస్సై చొరవతో విద్యార్థిని ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షకు హాజరైంది. సమయానికి స్పందించి విద్యార్థినిని ఆదుకున్న ఎస్సై రాజేందర్‌పై పరీక్షా కేంద్రం వద్ద ఉన్న తల్లిదండ్రులు, ప్రజలు ప్రశంసల జల్లు కురిపించారు.

